## క్లుప్తంగా

### దరఖాస్తులు చేసుకోండి

**అశ్వారావుపేటరూరల్:** చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయాల ఆర్థిక సాయం ప్రకటించిన నేపథ్యంలో అర్హత ఉన్న బీసీ కుల, చేతి వృత్తిదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ.. ఆర్థిక సాయం కోసం ఈ నెల 20వ తేదీలోపు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని, ఆన్‌లైన్ కాపీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లు జత చేసి, ఫొటోతో కూడిన దరఖాస్తును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ పథకానికి బీసీ కుల వృత్తులు, చేతి వృత్తిదారులు మాత్రమే అర్హులని, వార్షిక ఆదాయం రూ.లక్షా 50 వేలలోపు మాత్రమే ఉండాలని తెలిపారు.

### వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

**అన్నపురెడ్డిపల్లి:** ఈ నెల 11న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాగర్జన గోడపత్రికలను ఆ పార్టీ మండల కార్యదర్శి ఊకే నారాయణ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే రైతు రుణాలను మాఫీ చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో నిర్వహించే ప్రజాగర్జనకు ప్రజలు భారీగా తరలి రావాలని కోరారు.

### మాజీ ఎమ్మెల్యే నివాళి

**మణుగూరురూరల్:** మణుగూరు మున్సిపాలిటిలోని లెనిన్‌నగర్‌లో ఇటీవల మరణించిన గండమాల కనకదుర్గ దశదిన కర్మలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై కనకదుర్గ చిత్రపటానికి పూలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బొల్లోజు భరత్, కటుకూరి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి సాంబ, దొడ్డపనేని మధుకుమార్, పాతూరి వెంకన్న, కోడి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ పట్టాలను రద్దు చేయాలి

**దుమ్ముగూడెం:** మండలంలో అక్రమంగా గిరిజనేతరులు 18మందికి చేసిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొమరం దామోదరరావు డిమాండ్ చేశారు. బుధవారం సీతానగరం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత తహసీల్దార్ ద్వారా అక్రమంగా జారీ అయిన పట్టా పాసుపుస్తకాల రద్దు విషయమై అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ఏనిక జగపతి, ఏనిక శివ, పూనెం మోహన్, కొమరం కన్నయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### కేసులు నమోదు చేయాలి

**దుమ్ముగూడెం:** మండలంలో 1/70 చట్టానికి విరుద్ధంగా నిర్మిస్తున్న కట్టడాల నిర్వాహకులపై ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలని ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ మణిదర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కుర్సం రవి,కల్లూరి కిరణ్‌కుమార్,మడకం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

**అశ్వాపురం:** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన బైరు ఈశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. దశదిన కర్మల ఖర్చులకు బుధవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూ.7,616 మృతుని కుటుంబానికి అందజేశారు. మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, నెల్లిపాక పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కమటం సురేష్, యూత్ అధ్యక్షుడు పర్వత నరేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

**చర్ల:** వ్యవసాయ మార్కెట్‌లోని సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యాన మార్కెట్ కార్యదర్శి పృథ్వీకి వినతిపత్రాన్ని అందజేశారు. సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు చెల్లించి ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింజేయాలని కోరారు. సెక్యూరిటీ గార్డులు రాంబాబు, శ్రీనివాసరావు, రమేష్, శేఖర్, వరదయ్య పాల్గొన్నారు.

### ఆదివాసీ గ్రామాలపై దృష్టి సారించండి

**చర్ల:** వలస ఆదివాసీ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని ప్రజాపంథా నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ బి.భరణిబాబుకు వినతిపత్రం అందజేశాక పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడారు. ఆదివాసీలకు కుల, ఆదాయ, నివాస ధృవపత్రాలను జారీ చేయాలని, పోడు భూములను హక్కు పత్రాలు ఇచ్చి రేషన్ కార్డు, ఆధార్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. భానుప్రకాశ్, గుండి రమేష్, మడవి గంగయ్య, పొజ్జయ్య, దేవయ్య, బీమా, దేవా, ఉంగ పాల్గొన్నారు.

# ఉజ్వల భవితకు 'బడిబాట'

- ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల పేర్లు నమోదు
- మండుటెండలోనూ సాగుతున్న కార్యక్రమం
- గ్రామాల్లో విశేష స్పందన


అశ్వారావుపేటలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యాన బడిబాట కార్యక్రమం..

**అశ్వారావుపేటరూరల్:** విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమానికి క్షేత్ర స్థాయిలో విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 3వ తేది నుంచి నిర్వహిస్తున్న బాడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి పిల్లలను గుర్తిస్తున్నారు. ఈ బడిబాట కార్యక్రమం అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చంద్రుగొండ మండలాల్లోన్ని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో ముమ్మరంగా సాగుతోంది. విద్యార్థులకు ఉజ్వల భవితను అందించేందుకు, విద్యార్థులను బడిబాట పట్టించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో పర్యటన**

ఈ ఏడాది విద్యాశాఖ బడి బయట పిల్లలు, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దాంట్లో భాగంగా విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఈ నెల 3వ తేది నుంచి 9వ తేది వరకు జరిగే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల వివరాలు, పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. ప్రతి పాఠశాల ఉపాధ్యాయులు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను నేరుగా కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, అన్ని అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం, ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఒప్పిస్తున్నారు. ఇప్పటి వరకు నియోజవర్గంలోని దమ్మపేట మండలంలో అత్యధికంగా, అన్నపురెడ్డిపల్లి మండలంలో తక్కువగా విద్యార్థుల పేర్లు నమోదు అయ్యాయి. కాగా రోజు రోజుకు విద్యార్థుల నమోదు సంఖ్య పెరుగుతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

గడిచిన వారం రోజులుగా ఎండలు మండిపోతుండగా, మండుటెండల్లోనే బడిబాట కార్యక్రమాన్ని ప్రతి రోజూ నిర్వహిస్తున్నారు. ఉదయాన్నే ఉపాధ్యాయులు కాలినడకన విద్యార్థులు, తల్లిదండ్రుల వద్దకు వెళ్లి విద్య ప్రాధాన్యత గురించి వివరిస్తున్నారు. కొంతమంది ఉపాధ్యాయులైతే ప్రైవేటు పాఠశాలల తరహాలో కరపత్రాలను ముద్రించి తల్లిదండ్రులకు అందిస్తున్నారు. అలాగే గ్రామాల్లో, ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. పాత విద్యార్థులు తిరిగి పాఠశాలల్లో చేరేలా, కొత్త పిల్లలు ప్రభుత్వ పాఠశాలలపై మక్కువ పెంచుకునేలా కౌన్సిలింగ్ చేస్తున్నారు. బడిబాట కార్యక్రమంలోనే పిల్లల సంఖ్య పెరుగుతుండటంతో ఉపాధ్యాయుల్లో సైతం ఉత్సాహం కనిపిస్తోంది.

**పెరిగిన విద్యార్థుల సంఖ్య..**

బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారే సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అశ్వారావుపేట మండలంలో పాఠశాలల్లో 87 మంది కొత్తగా చేరారు. దమ్మపేట మండలంలో 147 మంది, అన్నపురెడ్డిపల్లిలో 20, ములకలపల్లి 74, చంద్రుగొండ 68 మంది వారివారి పరిధిలో ఉన్న పాఠశాలల్లో కొత్తగా చేరారు. ఈ చొప్పున నియోజకవర్గంలో మొత్తం 330 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వాటిల్లో 396 మంది విద్యార్థులు కొత్తగా చేరారు.

**స్పందన బాగుంది**



విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల పేర్లు నమోదు చేస్తున్నారు. కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

– పెండెకంట్ల కృష్ణయ్య, ఎంఈఓ, అశ్వారావుపేట

**ప్రాధాన్యతను వివరిస్తున్నాం..**



ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే కలిగే ప్రయోజనాలు, ప్రాధాన్యత గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి చెబుతున్నాం. అవగాహన ర్యాలీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే పథకాలు, సౌకర్యాలపై ప్రచారం చేస్తున్నాం.

– సీహెచ్.నరసింహారావు, కాంప్లెక్స్ హెచ్ఎం, అశ్వారావుపేట

# ఘనంగా సాగునీటి దినోత్సవం


చర్ల: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రత్నకల్యాణి

**చర్ల:** తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం చర్లలో సాగునీటి దినోత్సవాన్ని నిర్వహించారు. డివిజన్ స్థాయిలో చర్లలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలు ఏర్పాటుచేసిన సమావేశానికి ఆర్డీఓ ఆర్.రత్నకల్యాణి హాజరై మాట్లాడారు. డివిజన్‌లో తాగునీటి వనరుల పునరుద్ధరణతో వచ్చిన ఫలితాలను వివరించారు. ఎంపీపీ గీదా కోదండరామయ్య, జెడ్పీటీసీ శాంత, తహసీల్దార్ బి.భరణిబాబు, సీఐ అశోక్ పాల్గొన్నారు.

**దమ్మపేట:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గస్థాయిలో సాగునీటి దినోత్సవాన్ని నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక మార్కెట్‌యార్డులో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. మిషన్ కాకతీయ ద్వారా అనేక చెరువుల్లో పూడిక తీయడం వల్ల ఒక పంట పండే భూముల్లో, నేడు రెండు పంటలు పండుతున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో అనేక సాగునీటి ప్రాజెక్టులను నిర్మించడం ద్వారా నేడు తెలంగాణ జలకళను సంతరించుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు దారా యుగంధర్, దారా మల్లికార్జున రావు, సోయం ప్రసాద్, నీటిపారుదల శాఖ ఈఈ సురేష్, డీఈకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

# 'సీతమ్మ' బ్యారేజ్ సందర్శన


సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద విప్ రేగా, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు

**అశ్వాపురం:** తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో దుమ్ముగూడెం ఆనకట్టకు దిగువన ప్రభుత్వం నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజీని బుధవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. తొలుత మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామంలోని సీతారామ ప్రాజెక్ట్ మొదటి పంప్‌హౌస్‌ను ఎమ్మెల్యే రేగా, అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. జలవనరులశాఖ అధికారులు మ్యాప్ ద్వారా సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణం, నీటి లభ్యత వంటి అంశాలను ఎమ్మెల్యేకు, ప్రజాప్రతినిధులకు వివరించారు. అనంతరం దుమ్ముగూడెం ఆనకట్టను సందర్శించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈలు శ్రీనివాస్, రాంబాబు, ఏఈలు నవీన్, రమేష్, జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# జాతరపై పరిశోధన


కరకగూడెం: సమ్మక్క-సారలమ్మ గుడివద్ద బిర్సాముండా పరిశోధక బృందం

**కరకగూడెం:** సమ్మక్క–సారలమ్మ వనదేవతల పూర్వ చరిత్రపై సూక్ష్మస్థాయిలో అధ్యాయనం కోసం మండలంలోని చిరుమళ్ల గ్రామంలో బుధవారం బిర్సాముండా బృందం పర్యటించి జాతర మూలాలను, అందుకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కాకతీయ యూనీవర్సిటీ పరిశోధక విద్యార్థి మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర పూర్వ మూలం చిరుమళ్లలోనే ఉందని తెలిపారు. పరిశోధక బృందంతో గ్రామస్తులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై దాడి కేసు నమోదు

**అశ్వారావుపేటరూరల్:** ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి, చంపుతానని బెదిరించిన ఓ వ్యక్తిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని జమ్మిగూడేనికి చెందిన పెనుకుల వెంకటేశ్వరరావు, తల్లి మంగరాజు, తమ్ముడు రాంబాబు కలిసి తమ పొలానికి కంచె ఏర్పాటు చేసుకుంటున్నారు. కాగా సరిహద్దు పొలానికి చెందిన సోబుల దుర్గారావు వారితో గొడవపడి దాడికి పాల్పడి, చంపేస్తానని బెదిరించాడు. దీనిపై బాధితుడు వెంకటేశ్వరరావు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా దుర్గారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

**బూర్గంపాడు:** బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బూర్గంపాడుకు చెందిన కేవీ రమణను, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గాడిద దామోదర్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్ దొర ఉత్తర్వులు అందించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశానుసారం బుధవారం బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుణ్ణి, ప్రధాన కార్యదర్శిని నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు తెలిపారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

### ఏకలవ్య స్కూల్‌కు ఎంపిక

**బూర్గంపాడు:** ఏకలవ్య మోడల్ స్కూల్‌లో చదివేందుకు సారపాకలోని బ్రిలియంట్ స్కూల్ విద్యార్థిని ఎంపికైంది. బ్రిలియంట్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న మూల సాత్వికరెడ్డి ఏకలవ్య మోడల్ స్కూల్‌లో సీటు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం బ్రిలియంట్ కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు, హెచ్ఎం.స్వర్ణకుమారిలు ఏకలవ్యలో సీటు సాధించిన సాత్వికరెడ్డిని అభినందించారు.

### నేడు విగ్రహాల ప్రతిష్ఠాపన

**దుమ్ముగూడెం:** మండలంలోని నరసాపురం గ్రామంలో ఉన్న చిన్న అరుణాచలం క్షేత్రంలో వీర బ్రహ్మేంద్ర స్వామి పరివార 45 దేవత విగ్రహాలను గురువారం ఉదయం 7.42కు ప్రతిష్ఠించనున్నారు. దీనిలో భాగంగా ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. బుధవారం కొనసాగాయి. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని స్వామి వారి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.

### జయప్రదం చేయండి

**కరకగూడెం:** టీడీపీ పినపాక నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 11వ తారీకున మండల పరిధిలోని రాళ్లవాగు వద్ద నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సిరిశెట్టి కమాలాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీకి బలమైన క్యాడర్ ఉందని భవిష్యత్తు టీడీపీదేనని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు చందా మధు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు మంజూరు చేస్తా..


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

**అశ్వారావుపేటరూరల్:** అకాల గాలి దుమారంతో ఓ పూరిల్లు నేలమట్టం కాగా.. బాధిత కుటుంబానికి ఇల్లు మంజూరు చేస్తానని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. మండలంలోని వినాయకపురం పంచాయతీ ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన వూకే వెంకటేష్‌కు చెందిన పూరిల్లు ఈదురుగాలులతో అర్ధరాత్రి సమయంలో కుప్పకూలిపోయింది. ఆ సమయంలో కుటుంబీకులంతా ఆరు బయట నిద్రించడంతో సురక్షితంగా బయట పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బుధవారం పడిపోయిన పూరిల్లు పరిశీలించి, బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. త్వరలో ప్రభుత్వం అమలు చేసే గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేస్తానన్నారు. అనంతరం కొత్త మామిళ్లవారిగూడెం గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు, జుజ్జూరి వెంకన్న, మందపాటి మోహన్‌రెడ్డి, రామినేని సత్యనారాయణ, గుడవర్తి వెంకటేశ్వరరావు, తాండ్ర యుగంధర్ పాల్గొన్నారు.

# పేదల భూముల్లో ప్రాజెక్టులు కట్టారు..

**భద్రాచలంటౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల భూములను గుంజుకుని ప్రాజెక్ట్‌లను నిర్మిస్తూ వారికి పరిహారం చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్ ఆరోపించారు.

భద్రాచలం పట్టణంలోని బీఎస్పీ కార్యాయలంలో బుధవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంత మేరకు భూమిని సాగులోకి తీసుకొచ్చారో చెప్పి అప్పుడు సాగు నీటి దినోత్సవం జరుపుకోవాలని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో అనేక ప్రాజెక్ట్‌లు నిర్మించిన ప్రభుత్వం డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ ఎందుకు నిర్మించలేదో చెప్పాలన్నారు. నాసిరకంగా ప్రాజెక్ట్‌ల పనులు చేయడంతో లీకులు, కట్టలు తెగుతూ శివారు భూములకు నీరు అందక రైతులు ప్రతి ఏటా పంటలు ఎండిపోయి నష్టపోతున్నారని అన్నారు.

ఈ సమావేశంలో దామోదర్, కృష్ణ, శేషావతారం, వీరస్వామి, రాంబాబు, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి

**భద్రాచలంఅర్బన్:** ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ఆ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సుభాష్ నగర్ కాలనీలో జరిగిన జోన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భద్రాచలంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా వీరయ్య గెలిచిన నాటి నుంచి భద్రాచలం పట్టణం అభివృద్ధికి దూరం అయిపోయిందని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులకు ఏమాత్రం శ్రద్ధ లేదని అన్నారు.

**సీపీఎం 5వ జోన్ కమిటీ ఏర్పాటు..**

సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ 5వ జోన్ కమిటీ ఏర్పాటు చేశారు. 5వ జోన్ కార్యదర్శిగా బెల్లంకొండ కుసుమ తోపాటు కమిటీ సభ్యులుగా ఎస్.వేణు, కోమల, కుమార్ స్వామి, రఘునాథ్, భాస్కర్, రాములుతోపాటు 30 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సుభాష్ నగర్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పోరాటం నిర్వహించాలని గడ్డం స్వామి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం భద్రాచలం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామ చెరువులపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

**అశ్వారావుపేటరూరల్:** తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు గ్రామ చెరువుల పండుగ, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులతో గ్రామ చెరువుల పండుగ, సాంస్కృతి కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమాలకు రైతులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఎంపీఓ సీతారామరాజు, ఐకేపీ, ఈజీఎస్ ఏపీఓలు వెంకటేశ్వరరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

# ప్రజాగర్జనను జయప్రదం చేయండి

**చంద్రుగొండ:** ఈ నెల 11న కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బొర్రా కేశవులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజాగర్జన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వేలదిమందిని సభకు తరలించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జడ శ్రీను, నాయకులు కనకం ఆంజనేయులు, స్వర్గం నాగభూషణం, వీ శ్రీనివాస్, బి.నరసయ్య పాల్గొన్నారు.

**చర్ల:** దగాకోరు పాలన సాగిస్తున్న నియంతల మెడలు వంచేందుకు చేపట్టిన ఆందోళనలలో భాగంగా కొత్తగూడెంలో జరిగే ప్రజాగర్జనకు వేలాదిగా ప్రజానీకం తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరావు, జిల్లా కమిటీ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, నాయకులు తెల్లం లక్ష్మీనారాయణ, నానిపల్లి భద్రం, కొంగూరు రాము, కోడిరెక్కల రాజారావు, ఉయికా గాంధీ, సోడి కన్నయ్య, కనితి మంగమ్మ పాల్గొన్నారు.

**మణుగూరురూరల్:** ఈ నెల 11న కొత్తగూడెంలో సీపీఐ తలపెట్టిన ప్రజా పోరుగర్జనను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మణుగూరు, రాయిగూడెం, గాంధీబొమ్మ సెంటర్, బాపనకుంట, విఠల్‌రావునగర్ గ్రామాల్లో కరపత్రాల ద్వారా విస్తృ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోందె కుటుంబరావు, అక్కి నర్సింహారావు, ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, ఎస్వీ నాయుడు, చింతల దశరథం, భిక్షం, వెంకటరెడ్డి, దేగల రాము, రావుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుడికి అభినందన


క్రీడాకారుడు సంతోష్‌ను అభినందిస్తున్న పీఓ

**దమ్మపేట:** అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ శిబిరానికి ఎంపికైన క్రీడాకారుడిని, భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ బుధవారం అభినందించారు. ఫిబ్రవరి నెలలో బీహార్ రాష్ట్రంలో, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాల్లో ఉత్తమ ప్రదర్శన చూపిన పార్కలగంచి ఆశ్రమ పాఠశాల విద్యార్థి వెలకం సంతోష్ జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి ఎంకయ్యాడు. ఈ సందర్భంగా సంతోష్‌ను పీఓ అభినందించారు. కార్యక్రమంలో డీడీ డేవిడ్‌రాజు, ఏటీడీఓలు చంద్రమోహన్, నరసింహారావు, హెచ్ఎం ధర్మా, పీడీ గోపాలరావు, పీఈటీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే అరెస్టు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

**భద్రాచలంఅర్బన్:** మహిళా రెజ్లర్లను వేధింపులకు గురిచేస్తున్న బ్రిజ్‌భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి, కో–కన్వీనర్ మర్లపాటి రేణుకలు మాట్లాడుతూ.. భారత ఖ్యాతిని విదేశీ గడ్డపై చాటి చెప్పిన తమపై బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, రక్షణ కల్పించాలని సుమారు 50 రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రేపిస్టులకు, దొంగలకు, కబ్జాదారులకు, అవినీతిపరులకు కొమ్ముకాస్తూ ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ నాయకులు నాగరాజు, జి.లక్ష్మణ్, పి.సంతోష్, వెంకటలక్ష్మి, ఏ.రాము, వేల్పూరి, రాము, బాలాజీ, మురళీకృష్ణ, చంటి, అజయ్ కుమార్, నరసింహారావు, కొర్సా రవి తదితరులు పాల్గొన్నారు.